సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



కేఎస్పీకి నీటి విడుదల

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి మూడో తడి పంటలకు నీటిని విడుదల చేశారు.

వివరాలు 8లో ▸



'పీయూ'లో మార్పులు

పీయూ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5 /16.2

ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రయాణికులకు మెరుగైన సేవలు

గద్వాల క్రైం: లక్షలాది మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలను మరింత సులభతరం చేసేందుకు టీఎస్ ఆర్టీసీ యాప్‌ను ప్రవేశపెట్టిందని గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, వివిధ రకాల ఫీచర్లతో రూపొందించిన గమ్యం యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ప్రయాణికుల కోసం నిత్యం బస్సు వెళ్లే సమయం, డ్రైవర్, కండక్టర్ వివరాలు, ప్రస్తుతం బస్సు ఏ ప్రాంతంలో ఉందనే సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరు గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

రెండోరోజు కొనసాగిన పరిశీలన




మల్దకల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో కేంద్ర బృందం సభ్యులు.. స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్వచ్ఛభారత్, గ్రామీణ ఉపాధి హామీ, ఇంకుడు గుంతలు, సెగ్రిగేషన్‌షెడ్లు, కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాల అమలుపై ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పింఛన్ విధానాన్ని వివరించారు. పింఛన్ పొందుతున్న వృద్ధులు, దివ్యాంగులు, గీతాకార్మికులు, చేనేత కార్మికులు మృతి చెందితే వారి పింఛన్‌ను కుటుంబ సభ్యులకు వర్తింపచేయదని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు దీపక్‌వర్మ, అమిత్ వర్మ, మహేష్‌లాల్, మయాక్బాల్‌లు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనికో రేటు..!

జిల్లాకేంద్రంలో ఓ రెవెన్యూ అధికారి అవినీతి లీలలు

- మధ్యదళారులతో పనులన్నీ చక్కదిద్దుతున్న వైనం
- వడ్డేపల్లి మండలం రామాపురానికి చెందిన మధ్యవర్తే కీలకసూత్రధారి
- అధికారి అవినీతిపై సోషల్ మీడియాలో దుమారం
- నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆగ్రహం



గద్వాల: ఆయనొక రెవెన్యూ అధికారి. నిబంధనల ప్రకారం జరగాల్సిన పనులను తాత్సారం చేస్తూ.. ఎవరైతే లంచం ఇస్తారో వెనువెంటనే నిబంధనలను తుంగలో తొక్కేసి లక్కున పని చేసి పెడుతూ అక్రమార్కుల నీరాజనాలు పొందుతున్నారు. ఈ అవినీతి వసూళ్లను చక్కబెట్టేందుకు ఏకంగా ఓ వ్యక్తిని దళారీగా పెట్టుకున్నాడు. ప్రభుత్వ అసైన్డ్ భూములు.. ఇనామ్ భూములు..లిటిగేషన్ ఉన్న పట్టా భూముల్లో ఏ మార్పులు చేయాలన్నా.. ఇసుక, మట్టి అక్రమ రవాణా చేయాలన్నా.. ఇలా ఏ పనైనా సరే లంచం ఇస్తే తెల్లారేసరికి అంతా ఓకే చేసి అందినకాడికి రూ.లక్షల్లో జేబులు నింపుకొంటున్నాడు. సదరు రెవెన్యూ అధికారి అవినీతిపై ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతుండడంతో జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

మధ్యవర్తి ఆధ్వర్యంలోనే సెటిల్‌మెంట్లు

ఇదిలాఉంటే రాత్రి వేళలో సదరు రెవెన్యూ అధికారి ఇంటి వద్ద భూపైరవీకారులు, ఇసుక, మట్టి దందా చేసే వ్యక్తులతో పెద్ద క్యూలైనే ఉంటుందని ప్రచారం వినిపిస్తోంది. రాత్రి వేళ వచ్చి సెటిల్‌మెంట్ చేసుకున్న వారికి మరుసటినాడే పని పక్కా అయిపోతుందని పైరవీకారులు బాహటంగా చెబుతున్నారు. ఈ అవినీతి దందాలకు సంబంధించి సెటిల్‌మెంట్ చేసేందుకు వడ్డేపల్లి మండలం రామాపురానికి చెందిన ఓ వ్యక్తిని మధ్యవర్తి (బ్రోకర్)గా నియమించుకున్నాడు. ఇతని ద్వారానే అన్ని రకాల లావాదేవీలు కొనసాగుతాయని కార్యాలయ సిబ్బందే పేర్కొంటున్నారు. ఒకవేళ సదరు మధ్యవర్తి అధికారి కార్యాలయంలో ఉన్నాడంటే.. బయటి వ్యక్తులతోపాటు కార్యాలయ సిబ్బంది కూడా ఆ గదిలోకి వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారని సమాచారం.



రెవెన్యూ అధికారి గదిలో రామాపురం గ్రామానికి చెందిన మధ్యవర్తితో మంతనాలు

ప్రజాప్రతినిధి ఆగ్రహం

ప్రజలకు సేవలందించాల్సిన కీలక శాఖలో ఉండే అధికారి ఇలా బరితెగించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైనంపై ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధికి పలువురు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో వారి కుటుంబ సభ్యుల పేర్లు సైతం వినిపిస్తుండడంతో దీనిపై సదరు ప్రజాప్రతినిధి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తప్పుడు పనులకు తమను బదనాం చేస్తే సహించేది లేదని సదరు రెవెన్యూ అధికారిని తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. అదేవిధంగా రామాపురానికి చెందిన మధ్యవర్తి ఎవరు, అతని గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని కొందరిని ఆదేశించినట్లు సమాచారం.

చేయి తడపాల్సిందే..

లంచం కొట్టు.. పనిపట్టు అనే సూత్రాన్ని వంట పట్టించుకున్న సదరు రెవెన్యూ అధికారి అందరికీ ఇదే సూత్రాన్ని ఫాలో అవ్వమని సలహా ఇస్తున్నాడు. ఇందుకు మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

- ■ గత ప్రభుత్వంలో మూడెకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని జిల్లా సమీపంలోని ఓ వ్యక్తికి కేటాయించారు. ఇతనికి ముగ్గురు సంతానం. కొద్ది కాలానికి సదరు వ్యక్తి మృతి చెందాడు. వాస్తవానికి వారసత్వం ప్రకారం ముగ్గురికి తండ్రి ఆస్తిలో సమానవాటా రావాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు. ముగ్గురు అన్నదమ్ముల్లో ఇది వరకే ఒకరు మృతి చెందడంతో మిగిలిన ఇద్దరి వద్ద రూ.4 లక్షల లంచం తీసుకుని ఇద్దరి పేరిట భూమిని రికార్డు చేశారు. మృతి చెందిన కుటుంబానికి అన్యాయం చేశాడని సదరు కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.
- ■ ఓ మండలంలోని ఇనామ్ భూమికి సంబంధించి రికార్డులో పేర్లు చేర్చేందుకు సదరు భూయజమానితో రూ.1.50లక్షలు తీసుకుని రికార్డు చేసినట్లు తెలిసింది.
- ■ అనంతపురం గ్రామశివారులో ఆరు ఎకరాలకు సంబంధించి రికార్డు పేర్లు మార్చేందుకు రూ.10లక్షల వరకు డీల్ చేసుకున్నట్లు జోరుగా ప్రచారం వినిపిస్తుంది. రెవెన్యూ అధికారి అవినీతిపై పలు పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొద్దిరోజులు ఆగమని వారికి చెప్పినట్లు సమాచారం.
- ■ ఇవేగాక రాత్రివేళలలో బైక్‌పై తనిఖీల పేరిట చక్కర్లు కొడుతూ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక దందా చేసే వారి వద్ద పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రచారం. అయితే దొరికిన వాహనాలకు చిన్నమొత్తంలో ఫైన్లు వేస్తూ ఉన్నతాధికారులకు అనుమానం రాకుండా తెలివి తేటలు ప్రదర్శిస్తున్నారని సదరు అధికారి సిబ్బంది చెవులు కొరుక్కోవడం గమనార్హం.

మెరుగైన బోధన చేయాలి

గద్వాల: విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు, నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల మండలం పుటాన్‌పల్లి గ్రామంలో గిరిజన సంక్షేమశాఖ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వంటగది, సిద్ధంగా ఉంచిన భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులతో సమస్యలపై ఆరా తీశారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అదేవిధంగా పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి



ఉదండాపురంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఇటిక్యాల: విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని.. క్రమశిక్షణతో చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ఉదండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి వివేక్ ట్రస్ట్ నుంచి పలు వస్తువులను పాఠశాలకు ఎస్పీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య లభిస్తుందని, విద్యార్థులు సేవాగుణంతో మెలిగి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. అనంతరం జిల్లా పోలీస్ యంత్రాంగం ద్వారా పాఠశాలకు రూ.25 వేలను అందించారు. అనంతరం వివేక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నుంచి భీమన్న మాట్లాడుతూ చదువు ద్వారానే గుర్తింపు లభిస్తుందని, భవిష్యత్‌ను మారుస్తుందని అన్నారు. పాఠశాలకు రూ.40వేల విలువ గల సామగ్రిని అందించడం జరిగిందన్నారు. పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ.10 వేల నగదును అందిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిఐ రవిబాబు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎస్ వెంకటేష్, హెచ్‌ఎంలు రెడ్డినాయక్, నాగరాజ్, పాఠశాల చైర్మెన్ నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

'అపార్'పై ప్రత్యేక దృష్టి సారించండి

అయిజ: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు అపార్ ఐడీల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని.. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని డీఈఓ అబ్దుల్ ఘని అన్నారు. గురువారం అయిజ ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలల వారీగా అపార్ ఐడీ క్రియేట్ చేసిన శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో ప్రయివేటు పాఠశాలలు వెనుకబడి ఉన్నాయని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ప్లానింగ్ కోఆర్డినేటర్ శాంతిరాజు, మండల విద్యాధికారి రాములు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఉండవెల్లి: ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన బోధన అందించడమే కాకుండా ఎంఈఓలకు సహకరించాలని.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈఓ అబ్దుల్ ఘని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి పాఠశాల గ్రాంట్స్‌ను వెంటనే రిలీజ్ చెయ్యాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఉన్న అన్ని సమస్యలను ఆ గ్రాంట్స్‌ను రిలీజ్ చేసి ఖర్చు పెట్టి పరిష్కరించాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయ్యాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియాల్ అధికారి శాంతిరాజ్, ఎంఈఓలు రామకృష్ణ, భగీరథ రెడ్డి, ఉపద్యాయులు తదితర్లు పాల్గోన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్ ఘని

ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ క్రియేట్ చేయాలి

అలంపూర్: ప్రతి విద్యార్థి అపార్ ఐడీ ఖచ్చితంగా క్రియేట్ చేయాలని డీఈఓ మహ్మద్ అబ్దుల్ ఘని అన్నారు. అలంపూర్ చౌరస్తాలో విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు మండలాల ఎంఈఓలతో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈఓ, సెక్టోరియల్ ప్లానింగ్ కో–ఆర్డినేటర్ శాంతిరాజ్ హాజరై మాట్లాడారు. ఖచ్చితంగా ప్రతి విద్యార్థి అపార్ ఐడీ క్రియేట్ చేయాలని, ఏమైన సమస్యలు ఉంటే ఎంఈఓలతో మాట్లాడి వంద శాతం పూర్తి చేయాలన్నారు.

ఆర్టీసీ దుకాణాలకు టెండర్ల ఆహ్వానం


గద్వాల క్రైం: జిల్లా పరిధిలోని గద్వాల, అయిజ, అలంపూర్, శాంతినగర్, ధరూర్ బస్టాండ్ ఆవరణలో నిర్మించిన వ్యాపార దుకాణాలకు టెండర్ల ప్రక్రియను నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు ఈ నెల 17వ తేదీన టెండర్ ఫాంలను డిపో కార్యాలయంలో తగిన రుసుం చెల్లించి పొందాలని తెలిపారు. చివరి తేదీ ఈ నెల 20 అని, పూర్తి వివరాలకు డిపో మేనేజర్‌ను సంప్రదించాలని తెలిపారు.

జీవితమే ముఖ్యం

ప్రేమపేరుతో ప్రాణాలు తీసుకోవద్దు.. తీయొద్దు

ప్రేమ అనేది రెండు మనసుల మధ్యన ఏర్పడే విడదీయరాని బంధం. ఇరువురిది ఒకేదారి అయినప్పుడే ఈ బంధం సాఫీగా సాగుతుంది. పెళ్లి అనే సరికొత్త జీవనం వైపు అడుగులు వేయించి భవిష్యత్ పునాదులకు బీజం వేస్తోంది. కానీ, ఇలాంటి ప్రేమ ప్రస్తుత రోజుల్లో తాత్కాలికమే అయింది. తెలిసీతెలియని వయసులో కొందరు ఆకర్షణకు లోనై.. మత్తులో మునిగి తేలుతున్నారు. మరికొందరు చిన్న వయసులోనే ప్రేమ పేరిట జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ప్రేమ ఎంతో బలమైందన్నది ఎంత నిజమో.. మనస్ఫూర్తిగా ప్రేమించి వివాహం చేసుకున్న వారి జీవితం అంతే బలంగా.. సాఫీగా సాగుతుందన్నది అంతే నిజం. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రేమ వివాహాలు, ప్రేమ ముసుగులో జరుగుతున్న దారుణాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– మహబూబ్‌నగర్ క్రైం/ గద్వాల క్రైం



- ఒప్పుకోకపోతే యువతులపై దాడులు సరికాదు
- పెద్దలు అంగీకరించకపోయినా ఆత్మహత్యలు
- జిల్లాలో అమ్మాయిలు, మహిళలపై పెరుగుతున్న దాడులు

మిడిమిడి జ్ఞానంతో ప్రేమకు దగ్గరవుతున్న కొందరు పెళ్లి విషయం వచ్చేసరికి ఇల్లు విడిచి వెళ్తున్నారు. ఇలాంటి కేసులు ఏటా సుమారు 200 వరకు ఉంటున్నాయి. వీరిలో బాలికలే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. చిన్నతనంలో కుటుంబ నేపథ్యం, సామాజిక స్థితిగతులు, ఆర్థికాంశాలు కూడా దోహదపడుతున్నాయి. గతేడాది జిల్లాలో 210కి పైగా అదృశ్య కేసులు నమోదయ్యాయి.

మహబూబ్‌నగర్‌లో షీటీం నమోదు చేసిన కేసులు, కౌన్సెలింగ్ వివరాలు

ఏడాది	ఫిర్యాదులు	కౌన్సిలింగ్స్	ఎఫ్ఐఆర్‌లు
2021	47	37	2
2022	64	48	8
2023	73	42	17
2024	110	88	26

డబ్బు ఉన్నా.. లేకపోయినా అమ్మాయిలు, అబ్బాయిలు ప్రేమించుకోవడానికి.. కలిసి జీవించడానికి సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కులాంతర వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీరిలో కొంతమంది తల్లిదండ్రులను ఒప్పిస్తే.. మరికొందరు ఎదిరించి పెళ్లి చేసుకుంటున్నారు.

విడిపోతున్న జంటలు అధికమే

తెలిసీతెలియని వయసులో ప్రేమ వివాహాలు చేసుకుంటున్న జంటల్లో చాలామంది విడిపోతున్నారు. పట్టణ ప్రాంతాలకు చదువుకోవడానికి వస్తున్న అమ్మాయిలు ఆటోడ్రైవర్లు, ఇతర పోకిరీల ఉచ్చులో పడి మోసపోతున్నారు. అయితే ప్రేమ పెళ్లి చేసుకుంటున్న వారిలో మనస్పర్థలు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో ఇద్దరి మధ్య దూరం ఏర్పడి, విడాకులకు దారి తీస్తోంది. ఇలా ఏటా పదుల సంఖ్యలోనే జంటలు విడిపోతున్న దాఖలాలున్నాయి. ప్రేమ వివాహాలు చేసుకున్న వారు, పెద్దలను ఒప్పించి ఒక్కటైన జంటలు సైతం చిన్నపాటి కారణాలకే విడిపోతుండటం ఆందోళన కలిగించే అంశం. గతేడాది జిల్లాలో 15 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు.

మైనర్లతో వివాహం నేరమే

వివాహానికి చట్టబద్ధంగా కనీస వయసు తప్పనిసరి. ఇందుకోసం ప్రభుత్వం నుంచి జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని ఆధారంగా చూపాల్సి ఉంటుంది. చట్టపరంగా యువతికి 18 ఏళ్లు, యువకుడికి 21 ఏళ్లు నిండి ఉండాలి. కానీ, ఏ మాత్రం అవగాహన లేకుండా కేవలం ఆకర్షణకు లోనై ప్రస్తుతం చాలామంది పెళ్లి చేసుకుంటున్నారు. ఇదే సమయంలో వయసు గురించి పెద్దగా పట్టించుకోవట్లేదు. అయితే యువతుల కనీస వయసు 18 ఏళ్లు నిండని పక్షంలో వారిని మైనర్లుగా భావించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో మైనర్లను వివాహం చేసుకోవడం, పెద్దల అనుమతి లేకుండా తీసుకెళ్లడం చట్టరీత్యా నేరం. ఇలాంటి కేసుల్లో యువతి సమ్మతి లేకుంటే యువకుడిపై అత్యాచారం, అపహరణ కేసులు కూడా నమోదు చేస్తారు. ఒకవేళ యువతి సమ్మతి ఉంటే కనీస వయసు పూర్తయ్యే వరకు ఆమె ఇష్టానుసారం ప్రభుత్వ సంరక్షణ కేంద్రంలో ఉంచుతారు.

ఒప్పుకోకపోతే దాడులు

ప్రేమ పేరుతో యువతులపై దాడులు, దారుణాలు, దాష్టీకాలు చేస్తున్న కీచకులు సైతం లేకపోలేదు. తన ప్రేమను అంగీకరించలేదన్న కారణంతో కాపుకాచి మరీ దారుణాలకు పాల్పడుతున్నారు. గతంలో జడ్చర్ల, ఖిల్లాఘనపురంలో ఈ తరహా సంఘటనలే చోటుచేసుకోవటం అందరికీ తెలిసిందే. తన ప్రేమను అంగీకరించలేదన్న కారణంతో హత్యచేశారు. కొన్నిచోట్ల పెద్దలు పెళ్లికి అంగీకరించట్లేదనే కారణంతో ప్రేమ పేరుతో జంటలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

■ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న ఏకైక మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2023లో 1,175 ఫిర్యాదులు రాగా ఇందులో 1,050 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ స్టేషన్‌లో 118 కేసులు నమోదయ్యాయి. 2024లో 921 ఫిర్యాదులు వస్తే 787 మందికి కౌన్సెలింగ్ ఇచ్చి, రాజీ కుదిర్చారు. 134 కేసులు నమోదు చేశారు.

గద్వాల జిల్లాలో నమోదైన కేసుల వివరాలు	నేరం	పోక్సో	అత్యాచారాలు	మహిళా హత్యలు	వరకట్న వేధింపులు	గృహహింస కేసులు
	2024	31	44	4	68	186
	2025	23	9	-	9	23

పెళ్లి నిర్ణయం పెద్దలకే..

- పెళ్లి విషయంలో మారుతున్న యువత వైఖరి
- కెరీర్, ఉన్నత స్థాయి ప్రమాణాలకు ప్రాధాన్యం
- తల్లిదండ్రుల నిర్ణయమే ఫైనల్ అని వెల్లడి
- ప్రేమిస్తే పేరెంట్స్‌ను ఒప్పించాలంటున్న యువత

ప్రేమ, వివాహం విషయంలో యువత ఆలోచన తీరు మారుతోంది. ప్రేమ, ఆకర్షణ, మ్యారేజ్ కన్నా జీవితంలో స్థిరపడేందుకే అధిక శాతం యువత ప్రాధాన్యం ఇస్తున్నారు. శుక్రవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాలోని మెడికల్, నర్సింగ్, ఇంజినీరింగ్, పీజీ కళాశాలల విద్యార్థులతో 'సాక్షి' నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 120మంది యువతులు, 120 మంది యువకుల చొప్పున మొత్తం 240 మందితో సర్వే నిర్వహించాం. యువతీ, యువకుల్లో భవిష్యత్‌పై స్పష్టమైన లక్ష్యాలు ఉండడం.. చదువు తర్వాత ఉద్యోగ సాధన.. ఆపై ఆర్థిక స్థిరత్వం తప్పనిసరిగా ఉండాలనే ధోరణి నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పెళ్లి విషయంలో పెద్దల మాటకే విలువ ఇస్తామని ఎక్కువ మంది చెబుతున్నారు. ఇందులో యువతులే కాక యువకులూ ఉండడం విశేషం. ఒకవేళ మనసులు కలిసి జీవితాంతం కలిసి ఉంటామనే నమ్మకం ఏర్పడి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నా పెద్దల అంగీకారం తప్పనిసరి తీసుకుంటామని అంటున్నారు. అయితే, ప్రేమ పెళ్లి విషయంలో యువతులతో పోలిస్తే యువకుల్లో కొంత ఎక్కువగా ఆసక్తి కనిపించింది. సర్వేలో భాగంగా యువతీ యువకులను వివిధ ప్రశ్నలు అడుగగా వారి సమాధానాలు ఇలా ఉన్నాయి...

– 'సాక్షి' నెట్‌వర్క్

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా యువత మనోగతం

ప్రేమ పెళ్లి.. పెద్దలు కుదిర్చిన పెళ్లిలో ఏది సరైనది?

	యువతులు	యువకులు
పెద్దలు కుదిర్చిన పెళ్లి	91	56
ప్రేమ వివాహం	11	23
లవ్ అండ్ అరేంజ్	18	41

ప్రేమ వివాహాలు భవిష్యత్ తరాలపై ప్రభావం చూపుతాయా?

చూపుతాయి	202
చూపవు	38

ప్రస్తుతం ప్రేమలో సోషల్ మీడియా ప్రభావం ఉందా?

ఎక్కువగా ఉంది	ఏ మాత్రం లేదు
227	13

కెరీర్ ముఖ్యమా.. పెళ్లి ముందా?

కెరీర్ ఫస్ట్	వయసు రాగానే పెళ్లి
222	18





రథోత్సవానికి హాజరైన భక్తులు

శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా...

మన్యంకొండలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున రథోత్సవం ప్రారంభమైంది. శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా..అంటూ వేలాది మంది భక్తులు హరినామస్మరణ చేస్తుండగా రథోత్సవం ముందుకు సాగింది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి రథోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి స్వర్ణాభరణ భూషితుడైన స్వామివారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

– వివరాలు 8లో..

శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా


రథంపై ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం

- భక్తిశ్రద్ధలతో గరుడవాహన సేవ
- భక్తుల హరినామస్మరణతో పులకించిన మన్యంకొండ

మహబూబ్‌నగర్ రూరల్: పేదల తిరుపతి మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం గురువారం తెల్లవారుజామున నిండు పౌర్ణమి వెన్నెల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణ, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి రథోత్సవం కమనీయంగా సాగింది. తేరు, కోనేరు మైదానాలు, ఘాట్‌రోడ్డు ప్రాంతాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. ఎక్కడ చూసినా భక్తజన సందోహమే కనిపించింది. భక్తుల హరినామస్మరణతో మన్యంకొండ పులకించిపోయింది.



స్వామివారి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి

గరుడ వాహనంపై తేరు మైదానానికి..

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి గరుడ వాహనసేవ, రథోత్సవం కనులపండువగా సాగింది. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గర్భగుడి నుంచి శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై మెట్ల మార్గం ద్వారా తేరు మైదానానికి తీసుకువచ్చారు. స్వర్ణాభరణాలు, కాగడాల వెలుతురులో పద్మావతి లక్ష్మీదేవి సమేత స్వామివారు మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. రథోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ రీతిలో రథం ముందు కుంభం పోశారు. రంగు రంగుల విద్యుత్ బల్బులు, రకరకాల పూలు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన రథంపై స్వామివారిని ఊరేగించారు. రథంపై స్వామివారి మహా మంగళహారతి చూయించినప్పుడు భక్తులు ఒక్కసారిగా గోవింద నామస్మరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో తన్మయం చెందారు. దాదాపు లక్ష మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని దేవస్థానం అధికారుల అంచనా.


కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తూ..


స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తజనం


మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

స్వామివారి అనుగ్రహం అందరిపై ఉండాలి

మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహం అందరిపై ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులు, పాలక మండలి సభ్యులకు సూచించారు. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మన్యంకొండ దేవస్థాన పాలక మండలి సభ్యులు అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోవింద్‌యాదవ్, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, మల్లు అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తరించిన భక్తులు..

ఓవైపు నిండు పౌర్ణమి వెన్నెల.. మరోవైపు హెడ్ లైట్ల వెలుతురులో రథోత్సవం జరిగిన తేరు మైదానం మెరిసిపోయింది. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ ఘట్టాన్ని చూసి భక్తులు తరించారు. రథం లాగే సమయంలో మహిళలు పెద్ద ఎత్తున పూనకాలు నిండారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా బాణాసంచా హైలైట్‌గా నిలిచింది. ఓవైపు తారాజువ్వల సందడి.. మరో వైపు బాణాసంచా పేలుళ్లతో తేరు మైదానం మార్మోగింది. స్వామివారు రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవం అనంతరం స్వామివారిని మళ్లీ గరుడ వాహనంపై మెట్ల మార్గం గుండా గర్భగుడిలోకి తీసుకెళ్లారు.


స్వామివారికి నైవేద్యం తయారు చేస్తున్న భక్తురాలు

క్లుప్తంగా

నాగర్‌కర్నూల్‌లో మహిళ హత్య



నాగర్‌కర్నూల్ క్రైం: మహిళను గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసిన ఘటన జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి వెనక ఓ పాఠశాల గేటు వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన శాంతమ్మ (55) భర్త చిన్న నర్సింహ 5ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో యాచకురాలిగా జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో జనరల్ ఆస్పత్రి వెనక ఓ పాఠశాల గేటు వద్ద శాంతమ్మ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ బుర్రి శ్రీనివాస్, సీఐ కనకయ్యగౌడ్ ఘటన స్థలాన్ని పరిశీలించగా.. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి బట్టలతో పాటు శాంతమ్మ మృతదేహంపై రక్తం మరకలు ఉండటం గుర్తించారు. శాంతమ్మపై అత్యాచారం చేయడంతో పాటు హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటన స్థలాన్ని క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేసిన అనంతరం మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై ఎస్ఐ గోవర్ధన్ మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం అనంతరం వైద్యుల నివేదిక ఆధారంగా శాంతమ్మ హత్యకు గల కారణాలు తెలిసే అవకాశం ఉందని తెలిపారు. మృతురాలికి కుమార్తె ఉండగా.. ఆమె ఇతర రాష్ట్రానికి పని కోసం వలస వెళ్లింది.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన బిందు

మిడ్జిల్: చెట్టుకు ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చేద్‌ఘాట్ తండాకు చెందిన బిందు(20)తోటి కోడలు రాజీ, ఇరువురు కొన్ని నెలలుగా గొడవ పడుతుండేవారు. బుధవారం మరోసారి రాజీ, బైరంపల్లి గ్రామానికి చెందిన యాదయ్యగౌడ్ బిందును దూషించారు. దీంతో మనస్థాపం చెంది గురువారం వ్యవసాయ పొలం దగ్గర చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని సిద్ధోటం గ్రామానికి చెందిన సుప్పరి లింగం(50) బుధవారం గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. రాత్రి గడిచినా ఇంటికి రాకపోవటంతో అతని కోసం కుటుంబ సభ్యులు వెతికారు. గురువారం చెరువులో లింగం మృతదేహం కనిపించింది. అతని భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జనార్దన్ తెలిపారు.

పీయూ అడ్మినిస్ట్రేషన్‌లో మార్పులు

- ఒకేరోజు ముగ్గురు ప్రిన్సిపాళ్ల బదిలీలు
- పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మధుసూదన్‌రెడ్డి
- నాన్‌టీచింగ్‌లో కూడా బదిలీలు జరిగే అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకే రోజు పీయూలోని ఫార్మసీ కళాశాల, ఎంఈడీ కళాశాల, పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లను బదిలీ చేస్తూ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప ఉత్తర్వులు జారీ చేశారు. వీసీగా శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్న తర్వాత రిజిస్ట్రార్‌తో పాటు పలు కీలక పోస్టుల్లో మార్పులు జరిగాయి. ప్రధానంగా టీఎస్‌పీఎస్సీ ద్వారా రెగ్యూలర్ ప్రతిపాదికన ఏడుగురు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులు రాగా.. వారిని వివిధ తాత్కాలిక పోస్టుల్లో పనిచేస్తున్న వారి స్థానాల్లో నియమించారు. తాత్కాలిక ఉద్యోగులను వేరే చోటుకు బదిలీ చేశారు. న్యాక్ బృందం పీయూను గత నెల సందర్శించిన నేపథ్యంలో పలు కీలక మార్పులు సైతం జరిగాయి. గురువారం ఒక్కరోజే ఐదుగురికి కీలక బాధ్యతలు అప్పగించారు. కొన్నేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బందిని కూడా త్వరలో బదిలీ చేయనున్నట్లు యూనివర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతుంది.


కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప

ఐదుగురికి కీలక బాధ్యతలు

గతంలో పీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, వీసీ ఓఎస్డీ, ఐక్యూఏసీ డైరెక్టర్, కంట్రోలర్‌గా విధులు నిర్వహించిన మధుసూదన్‌రెడ్డికి పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. అదనంగా ఐక్యూఏసీ బాధ్యతలు కూడా నిర్వహించనున్నారు. పీయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగిన చంద్రకిరణ్‌ను అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా నియమించారు. ఎంఈడీ కళాశాల అధ్యాపకులుగా పని చేస్తున్న కరుణాకర్‌రెడ్డికి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్‌గా, ఫార్మసీ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న రవికాంత్‌కు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. గతంలో అడిషనల్ కంట్రోలర్‌గా పనిచేసిన విజయలక్ష్మికి పీజీ, డిగ్రీ కళాశాలల అడిషనల్ డైరెక్టర్‌గా నియమించారు.

> **అవసరానికి అనుగుణంగా..**
>
> యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేషన్‌పరమైన అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని మార్పులు చేస్తాం. అందులో భాగంగా పీజీ కళాశాల, ఫార్మసీ, ఎంఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, జాయింట్ డైరెక్టర్, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్లకు స్థానం చలనం కల్పించాం. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికిలో చాలా మంది ఏళ్లుగా ఒకే దగ్గర పనిచేస్తున్నారు. అవసరం అయితే వారిని బదిలీ చేస్తాం.
>
> – శ్రీనివాస్, పీయూ వైస్‌ఛాన్స్‌లర్

కానిస్టేబుల్‌పై అనర్హత వేటు

- పేకాటరాయుళ్లతో మామూళ్ల వసూలు
- హాట్‌టాపిక్‌గా మారిన వైనం
- శాఖాపరమైన చర్యలు తప్పవు: ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: మండలంలో గుట్టుగా పేకాట ఆడుతున్నట్లు ఓ వ్యక్తి కానిస్టేబుల్‌కు సమాచారం అందించాడు. అయితే తనకు సంబంధం లేని మండలంలోకి వచ్చి నేరుగా పేకాట స్థావరం వద్దకు చేరుకుని పోలీస్ దర్పం ప్రదర్శించాడు. దీంతో పేకాటరాయుళ్లు భయాందోళనకు గురై కొంత డబ్బులు ఇస్తామనడంతో రూ. 20 వేలకు ఒప్పందం చేసుకుని అక్కడి నుంచి జారుకున్నాడు. ఈ విషయం వైరల్ కావడంతో 15 రోజుల క్రితం జిల్లా పోలీసుశాఖ రహస్య విచారణ చేపట్టి ఎట్టకేలకు సంబంధిత కానిస్టేబుల్‌పై అనర్హత వేటు వేయడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వేళ్తే.. గద్వాల రూరల్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్‌నాయక్ ఇటీవల సాధారణ బదిలీలో భాగంగా మల్దకల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లాడు. అయితే 15 రోజుల క్రితం గద్వాల మండలంలోని ఓ గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు ఓ అజ్ఞాత వ్యక్తి కానిస్టేబుల్ రమేష్‌నాయక్‌కు సమాచారం అందించగా.. పేకాట స్థావరం వద్దకు వెళ్లి కానిస్టేబుల్ పేకాటరాయుళ్లను బెదిరించి రూ. 20 వేలు వసూలు చేసి అక్కడి నుంచి జారుకున్నాడు. అయితే ఈ విషయాన్ని బాధితులు స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

రంగంలోకి ప్రత్యేక విభాగం

మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రమేష్‌పై వచ్చిన ఆరోపణలపై జిల్లా పోలీసు శాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక విభాగం సిబ్బందిని రంగంలోకి దింపి రహస్య విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్‌ను 15 రోజుల పాటు విచారణ చేసిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతడిపై అనర్హత వేటు వేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కానిస్టేబుల్ చేసిన నిర్వాకంపై జిల్లా పోలీసుశాఖ తీసుకున్న చర్యలకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> **ఉపేక్షించేది లేదు**
>
> మల్దకల్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రమేష్‌నాయక్‌పై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అంతర్గత విచారణ చేసి వివరాలు సేకరించారు. పేకాటరాయుళ్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కానిస్టేబుల్ నేరం అంగీకరించాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కానిస్టేబుల్‌పై అనర్హత వేటు వేశాం. గతంలో సైతం ఎస్ఐలు, సీఐ స్థాయి అధికారులపై ఇలాంటి వ్యవహారంలో ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకున్నాం. నిబంధనలు అతిక్రమించే సిబ్బంది ఎవరైనా సరే ఉపేక్షించేది లేదు.
>
> – శ్రీనివాసరావు, ఎస్పీ



నిందితులను పట్టించిన ట్రాఫిక్ సీరియల్ నంబర్

- ప్రయాణికుడిపై దాడి చేసిన ఇద్దరు యువకులు

మహబూబ్‌నగర్ క్రైం: సీసీ కెమెరాల ద్వారా ఆటోపై ఉన్న ట్రాఫిక్ సీరియల్ నంబర్ ఆధారంగా నేరం చేసిన వ్యక్తులను టూటౌన్ పోలీసులు 2 గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. నవాబ్‌పేటకు చెందిన అంజయ్య జడ్చర్లలో పని ముగించుకుని బుధవారం రాత్రి 11.30 ప్రాంతంలో తిరిగి నవాబ్‌పేటకు వెళ్లడానికి మహబూబ్‌నగర్ పాతబస్టాండ్ దగ్గర ఆటో కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో మహ్మద్ జాకీర్, ఆజీజ్ లు తాగిన మైకంలో ఆటోను తీసుకుని అక్కడికి వచ్చారు. దీంతో అంజయ్యను ఆటోలో ఎక్కించుకుని నవాబ్‌పేట వైపు బయలుదేరారు. బోయపల్లి దాటి తర్వాత ఆటోను తువ్వగడ్డ తండా వైపు దారి మళ్లించి కొంత దూరం వెళ్లిన తర్వాత ఆటోను నిలిపి అంజయ్యపై దాడి చేసి అతని దగ్గర ఉన్న నగదు తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంజయ్య గాయాలతో ఇంటికి చేరుకుని చికిత్స తీసుకుని గురువారం సాయంత్రం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు 2 గంటల వ్యవధిలో పాతబస్టాండ్ నుంచి బోయపల్లి వైపు మార్గంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి ఆటోపై ఉన్న ట్రాఫిక్ సీరియల్ నంబర్ ఆధారంగా ఆటోను గుర్తించారు. వెంటనే ఆటో యాజమానిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నిందితులు మహ్మద్ జాకీర్, ఆజీజ్‌లను అరెస్టు చేశారు. ఈ మేరకు సదరు యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ వెల్లడించారు.

రోడ్డుకు అడ్డుగా ఇటుకల ట్రాక్టర్ ట్రాలీ


రోడ్డుపై నిలిచిన ట్రాలీ కారణంగా నిలిచిన బస్సు

గట్టు: మండలంలోని తప్పెట్ల మొర్సు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల మధ్య రోడ్డుపై ఇటుకల లోడు ట్రాక్టర్ ట్రాలీని నిలిపేయడంతో రహదారిపై అటు, ఇటు వస్తున్న బస్సు, వాహనాలు నిలిపేశారు. గురువారం గద్వాల నుంచి తాటికుంట మీదుగా గట్టుకు వస్తున్న ఆర్టీసీ బస్సు తప్పెట్ల మొర్సు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల మధ్య నిలిచిపోయింది. దీంతో బస్సులో ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇటుకల లోడు ట్రాలీని రోడ్డుపై వెదిలేయడంతో దారిలేక బస్సు వెనక్కి తిరిగి వెళ్లిపోయింది. గొర్లఖాన్‌దొడ్డిలో శిక్షణ కోసం వస్తున్న కొంత మంది ఉపాధ్యాయులు అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లారు. ద్విచక్ర వాహనాలపై మరి కొందరు గమ్యానికి చేరుకున్నారు. గట్టుకు వచ్చే ప్రయాణికులు ఆలస్యంగా చేరుకున్నారు.


సుస్థిర, సమగ్ర వ్యవసాయానికి ప్రాధాన్యత

బిజినేపల్లి: క్షేత్రస్థాయిలో రైతుల ప్రయోజనం, వారి ఆర్థిక వనరుల్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సుస్థిర, సమగ్ర వ్యవసాయంపై దృష్టి పెట్టాలని పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డా.పుష్పావతి అన్నారు. గురువారం పాలెం ఆర్ఏఆర్ఎస్, కేవీకే, ఏరువాక కేంద్రం వారు సంయుక్తంగా ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రీయ సలహా, సమన్వయ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ వాతావరణ పరిస్థితుల్ని అంచనా వేస్తూ రైతుల కోసం తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. యూనివర్సిటీ హెడ్ డీఈఈఓ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో రైతులకు సమాచారాన్ని అందజేసేందుకు నూతన విస్తరణ పద్ధతుల్ని అనుసరించాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించాలి

- జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర అన్నారు. వరంగల్‌లో ఈనెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను గురువారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర జెండా ఊపి అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అండర్–14 విభాగం బాల, బాలికల ఏ గ్రూపులో 60మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, బీ గ్రూపులో 60మీ, లాంగ్‌జంప్, షాట్‌పుట్, సీ గ్రూపులో 60మీ, లాంగ్‌జంప్, 600మీ పరుగు, అండర్–16 విభాగంకు 400మీ, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, అండర్–18 విభాగం 100మీ, 200మీ, 400మీ, 1000మీ, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, అండర్–20 విభాగంకు 400మీ, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో అంశాల్లో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం కోశాధికారి ఆనంద్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు రమేష్‌బాబు, సి.శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, అథ్లెటిక్ కోచ్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.


జెండాఊపి ఎంపికలను ప్రారంభిస్తున్న కార్యదర్శి శరత్‌చంద్ర

కోయిల్‌సాగర్ నీటి విడుదల

- మూడో తడి పంటలకు..
- 8 రోజుల పాటు కొనసాగింపు
- జూరాల నుంచి వస్తున్న నీరు


జూరాల నుంచి ఒక పంపు ద్వారా కోయిల్‌సాగర్‌కు విడుదల చేసిన నీరు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి మూడో తడి పంటలకు నీటిని గురువారం ఉదయం విడుదల చేశారు. యాసంగి పంటల సాగుకు ఇప్పటి వరకు రెండు తడులుగా నీటిని విడుదల చేయగా, ప్రస్తుతం మూడో తడికి కుడి ఎడమ కాల్వల ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. 8 రోజుల పాటు నీటి విడుదల కొనసాగుతుందని అధికారులు ప్రకటించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 25.10 అడుగుల మేర నీటి మట్టం ఉంది.

విరామం ఇస్తూ నీటి విడుదల..

కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద యాసంగి సాగుకు విరామం ఇస్తూ తడులుగా నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటికే మొదటి తడికి గతేడాది డిసెంబర్ 25 నుంచి జనవరి 8వరకు 15 రోజుల పాటు నీటిని వదిలారు. 15 రోజుల విరామం తరువాత రెండో తడికి జనవరి 24 నుంచి 31వరకు 8 రోజుల పాటు నీటిని అందించారు. 12 రోజుల విరామం తరువాత మూడో తడికి గురువారం నీటిని వదిలారు. డిసెంబర్‌లో నీటి విడుదలకు ముందు ప్రాజెక్టులో 31.6 అడుగుల మేర నీటి మట్టం ఉండగా, రెండు తడుల తరువాత 5.8 అడుగుల మేర తగ్గి 25.10 అడుగులకు చేరింది. మూడో తడి తరువాత నాలుగు, ఐదో తడికి నీటిని విడుదల చేయాల్సి ఉంది.

జూరాల నుంచి నీటి విడుదల..

జూరాల ప్రాజెక్టు నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేశారు. ఒక పంపును రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని కోయిల్‌సాగర్‌కు అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి యాసంగి పంటలకు 350 క్యూసెక్కుల నీటిని వదలడం వల్ల ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుతోంది. దీన్ని భర్తీ చేయడానికి తీసుకున్న చర్యలలో భాగంగా జూరాల నుంచి ఒక పంపు రన్ చేసి నీటిని అందిస్తున్నారు.

> **ప్రాజెక్టు చరిత్రలో మొదటి సారి..**
>
> ప్రాజెక్టు చరిత్రలో వానాకాలం తరువాత జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేయడం ఇదే మొదటిసారి అని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ఇటీవల జిల్లా మంత్రితో పాటు జూరాల పరిధిలోని ఎమ్మెల్యేలు కర్ణాటక సీఎంను కలిసి జూరాలకు నీటిని విడుదల చేయించారు. జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేశారని తెలిపారు. వేసవిలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ప్రస్తుతం జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేశారని తెలిపారు.